క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



మల్హర్: డీసీఎంఎస్ ఆధ్వర్యంలో మండలంలోని కొయ్యూరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ లింగమూర్తి శుక్రవారం ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలిని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహేష్, ఉప సర్పంచ్ మమత, ఏఈఓ అనూష, పీఏసీఎస్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



చిట్యాల: విద్యుత్ ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని గిద్దెముత్తారం గ్రామంలోని సబ్‌స్టేషన్ కార్యాలయంలో రైతులకు, వినియోగదారులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోలవేని పోషాలు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన



చిట్యాల: మండలంలోని జూకల్ గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని ఎంపీడీఓ రామయ్య, ఏపీఓ హాలీంపాషా శుక్రవారం పరిశీలించారు. మొక్కలను జాగ్రత్తగా పెంచాలని వాచర్‌కు, ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. వంద శాతం మొక్కలు పెంచేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఆయన వెంట సర్పంచ్ పుట్టపాక మహేందర్, తదితరులు ఉన్నారు.

పరామర్శ



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన గట్టు సాంబయ్య శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి పరకాలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు పరామర్శించి ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు.

కార్డన్ సెర్చ్



మహదేవపూర్: మండలంలోని ఎన్కపల్లి గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా ఎస్సై భవానీ సేనా ఆధ్వర్యంలో శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం గ్రామ కూడలి వద్ద గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామంలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు, సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత చదువులు చదువుకోవాలని సూచించారు.

అనారోగ్యంతో యువకుడి మృతి



రమేష్ (ఫైల్)

మొగుళ్లపల్లి: మండల కేంద్రానికి చెందిన శనిగరపు రమేష్ (33) అనే యువకుడు వారం రోజులుగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. స్థానిక సర్పంచ్ మోటె ధర్మారావు శుక్రవారం మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో మేక మృతి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల గ్రామంలో శ్రీరాముల రాజయ్యకు చెందిన మేక మేతకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ తీగకు తగిలి షాక్‌తో శుక్రవారం మృతి చెందింది. మెత మేస్తున్న క్రమంలో విద్యుత్ సరఫరా అవుతున్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి కంచె లేకపోడంతో ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. మేక విలువ రూ.15వేల వరకు ఉంటుందని తెలిపాడు.

క్రీడలను పకడ్బందీగా నిర్వహించాలి



చిట్యాల: క్రీడామైదానాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మహాముత్తారం: మండల అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లోని ప్రజాప్రతినిధులతో కలిసి మండలస్థాయి క్రీడలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీపీ సుభద్ర అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో సీఎం కప్ 2023మండలస్థాయి క్రీడల నిర్వహణకు ఎంపీపీ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఈ నెల15 నుంచి 17వరకు అథ్లెటిక్స్(రన్నింగ్, హైజంప్, లాంగ్‌జంప్) కబడ్డీ, కోకో, వాలీబాల్ పోటీలు నిర్వహించాలని చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఈ మేరకు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసి క్రీడాకారులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనే విధంగా చూడాలని తీర్మానించినట్లు తెలిపారు. మండలంలో పనిచేస్తున్న పీఈటీలు విజయలక్ష్మి, భారతి, భానుప్రకాష్, రాజబాపునకు క్రీడల నిర్వహణ బాధ్యతలను అప్పగించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు మండలకేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ మహాముత్తారం ప్రధానోపాధ్యాయుడు అనిల్‌కుమార్ వద్ద ఈనెల13లోపు పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, తహసీల్దార్ శ్రీనివాస్, కమిటీ సభ్యులు లింగమల్ల శారద, ప్రధ్యానోపాధ్యాయుడు అనిల్, ఎస్సై సుధాకర్ తదితరులు ఉన్నారు.

భూపాలపల్లి అర్బన్: సీఎం కప్ 2023 మండల స్థాయి క్రీడా పోటీలను ఈ నెల 15నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అనిల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో స్థానిక ఎంపీపీ మండల లావణ్య అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు ఎంఈఓ దేవానాయక్, పీడీ రాజయ్యల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 99486 38070, 99492 47606 నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఇక్బాల్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శోభ, ఎస్‌ఐ రామకృష్ణ, పీఈటీ జైపాల్ పాల్గొన్నారు.

పలిమెల: మండలం కేంద్రంలో ఈనెల 15 నుంచి 17 వరకు అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, ఖో ఖో, వాలీబాల్, కబడ్డీ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల యువతి, యవకులు వారివారీ గ్రామాల నుంచి టీంలుగా ఏర్పడి పాల్గొనాలని సూచించారు.

టేకుమట్ల(రేగొండ): ఈ నెల 15 నుంచి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో సీఎం కప్ క్రీడలు నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేకాధికారి శామ్యూల్, ఎంపీడీవో సురేందర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సీఎం కప్ క్రీడలపై ఎంపీపీ పున్నం లక్ష్మీరవి ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. మరిన్ని వివరాల కోసం 92814 81813 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షరీఫ్‌మొహినొద్దీన్, జెడ్పీటీసీ సాయిని విజయముత్యం, ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, ఎంపీఓ గడ్డం రాంప్రసాద్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాటారం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 15 నుంచి 17 వరకు మండల స్థాయిలో నిర్వహించనున్న చీఫ్ మినిస్టర్ కప్ 2023 క్రీడాపోటీలను విజయవంతం చేయాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీడీఓ శంకర్‌నాయక్ కోరారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం క్రీడాపోటీల నిర్వహణపై మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. 15 సంవత్సరాల నుంచి 36 సంవత్సరాల వయస్సు గల స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు వ్యక్తిగతంగా, టీములవారిగా ఈ నెల 12 సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వంద మీటర్లు, 400 మీటర్ల పరుగులో పాల్గొనే వారు పీడీ రమేశ్, సెల్ నంబర్ 9441136308, వాలీబాల్ రాధ పీఈటీ సెల్‌నెంబర్ 7337439849, కబడ్డీలో పాల్గొనేవారు శ్రీనివాస్, పీడీ సెల్‌నెంబర్ 6302600294, ఖోఖోలో పాల్గొనే వారు శ్రీధర్ పీడీ, సెల్ నంబర్ 9182309032 సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనేవారు పదవ తరగతి మార్కుల మెమో లేదా పుట్టిన తేదీ ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు సమర్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ జివాకర్‌రెడ్డి, ఎస్సై శ్రీనివాస్, పీడీలు రమేశ్, శ్రీనివాస్, రాధ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆవరణంలోని క్రీడా మైదానంలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీపీ దావు వినోద, జెడ్పీటీసీ గొర్రె సాగర్, ఎస్సై కృష్ణప్రసాద్ క్రీడాస్థలాన్ని పరిశీలించారు. ఈనెల 15, 16, 17వ తేదీలలో మండల స్థాయి పుట్ బాల్, కబడ్డీ, 100, 200 అథ్లెటిక్స్ నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.



రేగొండలో మాట్లాడుతున్న అధికారులు



కాటారం: మాట్లాడుతున్న ఎంపీపీ సమ్మయ్య



మహాముత్తారం: సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

బీఆర్ఎస్‌తోనే సమగ్ర అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

కాటారం: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధి సాధ్యపడుతుందని ఆ పార్టీ నాయకుడు బెల్లంకొండ నర్సింగరావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శదాయకం అన్నారు. సీఎం కేసీఆర్ అమల్లోకి తీసుకొస్తున్న పథకాల వైపు దేశ ప్రజలు చూస్తున్నారని, దేశ వ్యాప్తంగా కేసీఆర్, బీఆర్ఎస్ పాలన కోరుకుంటున్నారని తెలిపారు. నూతన సచివాలయం, ఇతరాత్ర కట్టడాలతో రాష్ట్ర ఖ్యాతిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాటుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెంది ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందాలంటే బీఆర్ఎస్ మూడోవ సారి అధికారంలోకి రావాలని అన్నారు. బీఆర్ఎస్‌ను గ్రామగ్రామాన బలోపేతం చేసే దిశగా ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు కొమ్మిడి భూమారెడ్డి, మల్యాల రాంచంద్రగౌడ్, బొమ్మ మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



భూపాలపల్లి అర్బన్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే

భూపాలపల్లి అర్బన్/టేకుమట్ల/రేగొండ/చిట్యాల/మొగుళ్లపల్లి: జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో, గ్రామాల్లో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేశారు. పలు ఆస్పత్రుల్లో పండ్లు పంపిణీ చేసి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిరిడిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కేక్ చేశారు. రేగొండ మండలంలో రూపిరెడ్డి చంద్రారెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.

తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలి



మొగుళ్లపల్లి: మాట్లాడుతున్న సీడీపీఓ అవంతి



మహదేవపూర్: మాట్లాడుతున్న ఎంపీపీ

మొగుళ్లపల్లి: తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలని సీడీపీఓ అవంతి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ఎంపీపీ యారసుజాతసంజీవరెడ్డి అధ్యక్షతన వయో వృద్ధుల సంక్షేమం–చట్టాల అమలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి సునీత, సీడీపీఓ అవంతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయి అధికారులు వృద్ధులతో మమేకమై వారి పోషణ జీవనశైలిపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు చట్టాలపై అవగాహన కల్పించి వృద్ధుల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణవేణి, సర్పంచ్ ధర్మారావు పిడిసిల్ల ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీఓ కుమారస్వామి, ఏపీఎం రవి వర్మ, పంచాయతీ కార్యదర్శులు మంజుల, శ్రీనివాస్, ఎమ్ఎస్‌కే కోఆర్డినేటర్ మమత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, మాధవి అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మహదేవపూర్: మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాణిబాయి ఆధ్వర్యంలో వయోవృద్ధుల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పీ డిప్యూటీ సీఈఓ రఘువరన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తల్లిదండ్రులను, వృద్ధులను వేధించిన చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని అన్నారు.

రైతులను ఆదుకోవాలి

భూపాలపల్లి అర్బన్: రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణరెడ్డి, తిరుపతి ప్రభుత్వాన్ని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పంట నష్టం జరిగిన ప్రాంతాలను సర్వే చేసి ప్రతిపాదనలు పోయినప్పటికీ, రైతులకు నష్టపరిహారం రాలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 2020 సంవత్సరం నుంచి పంటల బీమా పథకం అమలు కాకపోవడంతో రైతులకు పరిహారం అందడం లేదన్నారు. వెంటనే పంటల బీమాను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

రిలే నిరాహార దీక్షలు ప్రారంభం



దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

భూపాలపల్లి అర్బన్: దళితబంధు పథకంలో లంచం తీసుకుంటున్న అవినీతి ఎమ్మెల్యేల జాబితాను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి మాట్లాడుతూ.. అవినీతికి పాల్పడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరిని దళిత ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేల చిట్టా బయటపెట్టే వరకూ పోరాటాలు నిర్వహిస్తామన్నారు. మందకృష్ణ ఆదేశల మేరకు ఈ నెల 10న కలెక్టరేట్ల ముట్టడి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజన్న, విజయ్‌కుమార్, శ్రీనావాస్, భిక్షపతి, సురేష్, రాజేందర్, శోభన్‌బాబు, తిరుపతి, భరత్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన



భూపాలపల్లి అర్బన్: ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు



టేకుమట్ల: అరెస్టు అయిన నాయకులు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట శుక్రవారం బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. కర్ణాటక ఎన్నికల మేనిఫెస్టోలో బభరంగ్ దళ్‌ను నిషేధిస్తామని పెట్టడంతో పార్టీ పిలుపు మేరకు రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట హనుమాన్ చాలీసా పారాయణం చేసేందుకు ప్రయ్నతించారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాయకులు పాపయ్య, ఎరుకల గణపతి, నిశీధర్‌రెడ్డి, ప్రసాద్‌రావు, రాజేందర్, మధుసూదన్, సంపత్, సాంబయ్య పాల్గొన్నారు.

టేకుమట్ల: కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య ఎలాంటి అవంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మండలంలోని బీజేపీ నాయకులను శుక్రవారం ముందస్తు పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు దేశెట్టి గోపాల్ మాట్లాడుతూ.. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే భజరంగ్ దళ్‌ని నిషేధిస్తామని మేనిఫెస్టోలో ఏర్పాటు చేయడం దురదుష్టమన్నారు. హిందువులను కించపరిచే విధంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడడం సరైంది కాదన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడిన కాంగ్రెస్ నాయకులకు ప్రజలు ఓటుతో తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. అరెస్టు అయిన వారిలో బీజేవైఎం మండల అధ్యక్షుడు కొలుగూరి రమేష్, మండల ప్రధాన కార్యదర్శి గుర్రపు నాగరాజు, జిల్లా నాయకులు దావు రఘు, మహేందర్, రాజు ఉన్నారు.

చిట్యాలలో..

కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య ఎలాంటి గొడవలు చోటుచేసుకోకుండా బీజేపీ నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్‌గౌడ్, గజనాల రవీందర్, తదితరులు ఉన్నారు.

జేపీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి



భూపాలపల్లి అర్బన్: కుటుంబ సభ్యులతో కలిసి దీక్ష చేస్తున్న కార్యదర్శులు



మల్హర్: గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

మల్హర్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జూనియర్ (జేపీఎస్) పంచాయతీ కార్యదర్శులు చేపడుతున్న నిరవధిక సమ్మెలో 8వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్యాలయం ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి శుక్రవారం వినతిప్రతం అందించి నిరసన తెలిపారు. జేపీఎస్ సంఘం మండల అధ్యక్షుడు నరేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి, తమ డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, సమ్మరాజు, ప్రసాద్, సాయిచరణ్, కుమారస్వామి, ప్రవీణ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల వినూత్న నిరసన

భూపాలపల్లి అర్బన్: గ్రామ పంచాయతీ జూనియర్, అవుట్‌సోర్సింగ్ కార్యదర్శులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం కొనసాగింది. కుటుంబ సభ్యులతో కలిసి దీక్షల్లో కూర్చున్నారు. వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు దేవేందర్, సతీష్, శశికాంత్, శ్రీదేవి, నరేష్, ఓంకార్, శరీష్, గోపి పాల్గొన్నారు.

మహాముత్తారం: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో సమ్మె చేపడుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం వర్షంలో సైతం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పంచాయతీ సిబ్బంది సంఘీభావం

కాటారం: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెకు శుక్రవారం గ్రామ పంచాయితీ సిబ్బంది సంఘీభావం తెలిపారు. జేపీఎస్ సమ్మెకు తమ పూర్తి మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామపంచాయతీల కారోబార్లు పాల్గొన్నారు.


చిట్యాల: జూనియర్, ఔట్‌సోర్సింగ్ గ్రామపంచాయతీ కార్యదర్శులును రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జేపీఎస్‌లు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారంతో 8వ రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె కొనసాగించారు. ఈ సమ్మెకు గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కారోబార్, శానిటేషన్ సిబ్బంది పూర్తి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మండలంలో పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామాల సిబ్బంది పాల్గొన్నారు.



మహాముత్తారం: వర్షంలో నిరసన తెలుపుతున్న కార్యదర్శులు



కాటారంలో..



చిట్యాలలో..

గుడుంబా స్వాధీనం



అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ ఎస్సై మాన్‌సింగ్

చిట్యాల: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో భూపాలపల్లి ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది శుక్రవారం రూట్‌వాచ్ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై గుడుంబాను తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్సై మాన్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. రూట్ వాచ్ చేస్తున్న క్రమంలో పాశిగడ్డతండా గ్రామానికి చెందిన లావుడ్య తిరుపతి అనే వ్యక్తి పది లీటర్ల గుడుంబాను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే భూపాలపల్లి మండలం గుర్రంపేట రైస్‌మిల్ వద్ద రూట్‌వాచ్ చేస్తుండగా శత్రుప్పులపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ ద్విచక్రవాహనంపై పది లీటర్ల గుడుంబాను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ రఘుపతి, సిబ్బంది విజయ్, అలీ, విష్ణువర్ధన్, బాలకృష్ణ పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

చిట్యాల: మండలంలోని జడల్‌పేట గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు గ్రామస్థుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే శ్రీమహాలక్ష్మీ, భూలక్ష్మీ సహిత గ్రామ నాభిశిల బొడ్రాయి, పోచమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని సర్పంచ్ కామిడి రత్నాకర్‌రెడ్డి తెలిపారు.